నేడు డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఖలీల్‌వాడి, అక్టోబర్ 4 : డీఎస్సీ-2024లో రాతపరీక్ష రాసిన అభ్యర్థులకు 1:3 ప్రకారం వివిధ కేటగిరీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నగరంలోని నిర్మల హృదయ పాఠశాలలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని డీఈవో ఎన్‌వీ దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోని అభ్యర్థులు శనివారం సాయంత్రం 5 గంటలలోగా వెరిఫికేషన్ చేయించుకోవాలని, లేకపోతే అభ్యర్థులు నాట్ విల్లింగ్‌గా పరిగణించబడతారని స్పష్టంచేశారు.

జీపీ కార్మికులకు దుస్తుల పంపిణీ

జీపీ కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఎంఏ హకీం

పొతంగల్, అక్టోబర్ 4 : మండలంలోని జల్లాపల్లి గ్రామంలో సామాజిక సేవా కర్త, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎంఏ హకీం జీపీ కార్మికులకు శుక్రవారం దుస్తులను పంపిణీ చేశారు. నెలలు తరబడి జీతాలు లేక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దసరా కానుకగా తన వంతు సహాయంగా దుస్తులు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం కార్మికులకు వేతనాలు చెల్లించాని కోరారు. కార్యక్రమంలో రాములు, షేరు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

ఖలీల్‌వాడి, అక్టోబర్ 4 : జిల్లాలో ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ ఇంగ్లిష్ పరీక్షకు 108 మందికి అభ్యర్థులకు 81 మంది హాజరైనట్లు తెలిపారు. ఇంటర్‌లో 68 మందికి 53 మంది హాజరుకాగా 15 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

అండర్ -19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు జిల్లా యువకుడు

విక్రాంత్‌రెడ్డి

కంఠేశ్వర్, అక్టోబర్ 2 : వరంగల్‌లోని స్పోర్ట్స్ బాక్స్ క్రికెట్ గ్రౌండ్స్‌లో ఇటీవల నిర్వహించిన అండర్ -19 రాష్ట్రస్థాయి క్రికెట్ ఎంపిక పోటీల్లో నిజామాబాద్ నగరంలోని గంగాస్థాన్‌కు చెందిన రాధిక -సత్యం రెడ్డి దంపతుల కుమారుడు విక్రాంత్‌రెడ్డి (18) పాల్గొన్నాడు. విక్రాంత్‌రెడ్డి ఇదివరకే జిల్లా స్థాయి అండర్-19 క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా, అండర్ -19 రాష్ట్రస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలకు ఎంపికై, పాల్గొనడంపై క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

మొరం టిప్పర్ పట్టివేత

నవీపేట, అక్టోబర్4: మల్కాపూర్ నుంచి నవీపేట కు మొరం తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై వినయ్ శుక్రవారం తెలిపారు. రెంజల్ మండలానికి చెందిన ఓ వ్యాపారి ప్రతి రోజూ రాత్రి వేళ అక్రమంగా మొరం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేసి మల్కాపూర్ శివారులో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. జరిమానా నిమిత్తం మైన్స్ అధికారులకు అప్పజెప్పునున్నట్లు ఎస్సై చెప్పారు.

మండపాల వద్ద ప్రత్యేకపూజలు

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

నాందేవ్‌వాడలో కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు

ధర్పల్లిలోని యంగ్‌స్టార్ యూత్ మండపం వద్ద..

రుద్రూర్ మండల కేంద్రంలో పూజలో పాల్గొన్న భక్తులు

ధర్పల్లి/ రుద్రూర్/ సుభాష్‌నగర్/ ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 4 : దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దేవీ మాత విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం అమ్మవారిని గాయత్రీ మాత రూపంలో అలంకరించి, పూజలు చేశారు. మాలధారులు మండపాల వద్ద సేవలు చేశారు. మండపాల వద్ద మహిళలు పండితుల ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న భవానీమాత కల్యాణ మండపాన్ని అయోధ్య రామాలయ రూపంలో అలంకరించారు. రాత్రివేళ విద్యుత్ దీపాల అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. నాందేవ్‌వాడలోని దుర్గామాత మండపం వద్ద నిర్వహించిన కుంకుమపూజలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకుంటే శుభాలు కలుగుతాయని అర్చకుటు అన్నారు ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రెండోరోజూ న్యాయవాదుల విధుల బహిష్కరణ

నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు

వినాయక్‌నగర్, అక్టోబర్ 4 : రాష్ట్ర బార్ అసోసియేషన్ పిలుపు మేరకు రెండో రోజు శుక్రవారం సైతం నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి, నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా కోర్టు చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ పోయి న్యాయవాదుల ప్రాణాలకు ఎసరుపెట్టే పోలీసింగ్ తయారైందని మండిపడ్డారు. మాదన్నపేట్ ఘటనకు బాధ్యులైన సిబ్బందిపై డీజీపీకి ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు వసంత్‌రావు, సురేశ్, పిల్లి శ్రీకాంత్, దీపక్, అపూర్వ, మాణిక్‌రాజు, ఆశ నారాయణ, అన్వేశ్, సృజన్, విజయ్ సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేసుకుంటూ పోతే పదవులు వరిస్తాయి

సభలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

ఖలీల్‌వాడి/ కంఠేశ్వర్, అక్టోబర్ 4 : పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు నాయకులు స్వాగతం పలకడంతో పాటు జిల్లాకేంద్రంలోని పాత కలెక్టర్ గ్రౌండ్‌లో విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సభలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. చిన్న స్థాయి నుంచి పీసీసీ అధ్యక్షుడిగా ఎదిగానని తెలిపారు. తన రాజకీయ గురువు ధర్మపురి శ్రీనివాస్ అని, కరాటే మాస్టర్‌గా ఉన్న తనను రాజకీయాల్లోకి తీసుకువచ్చి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా నియమించారని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం డీఎస్ లేకపోవడం బాధగా ఉందన్నారు. రాజకీయాల్లో పనిచేసుకుంటూ పోతే హైకమాండ్ గుర్తించి, పదవులు అప్పగిస్తుందని అన్నారు. బీసీ అయిన తనకు హైకమాండ్ పెద్దపీటవేసిందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన పథకాలను అమలుచేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు కొండ సురేఖ, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమట్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, వీహెచ్, మధుయాష్కి, అజారుద్దీన్, ఈరవత్రి అనిల్, ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

డబుల్ బెడ్‌రూం ఇంటిని పరిశీస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

వినాయక్‌నగర్, అక్టోబర్ 4 : నిజామాబాద్ నగర శివారులోని నాగారంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను అర్హులైన వారికి వెంటనే కేటాయించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నాగారంలో ఇండ్లను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అని చెప్పి.. ఇప్పటివరకు ఒక ఇంటి నిర్మాణం కూడా దిక్కులేదని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కింద అర్బన్ నియోజకవర్గానికి 7500 ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్థలం ఉన్న వారు ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షల నిధులు మంజూరు చేయాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు ఉన్నారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రనాయకుడు రాజారాంయాదవ్

ఇందల్వాయి, అక్టోబర్ 4 : రాష్ట్రంలోని యాదవ సంఘం సభ్యులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర యాదవ నాయకుడు రాజారాం యాదవ్ అన్నారు. మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో యాదవ సంఘ మండల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు మహిపాల్ యాదవ్‌తో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. యాదవులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూత నందించాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్న గంగారాం, జనరల్ సెక్రటరీగా బట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా రాజేశ్వర్, సభ్యులుగా గొల్ల భాస్కర్, మనోజ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ యాదవ కన్వీనర్ శ్రీనివాస్ యాదవ్, రాజన్న యాదవ్, వివిధ గ్రామాల యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి అదృశ్యం

నరేశ్ (ఫైల్)

వినాయక్‌నగర్, అక్టోబర్ 4 : నగరంలోని పవన్‌నగర్‌కు చెందిన దివ్యాంగుడు మామిండ్ల నరేశ్(35) నాలుగు రోజులుగా కనిపించడం లేదని అతని తల్లి లక్ష్మి త్రీ టౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. గత నెల 30న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిన నరేశ్.. ఇంటికి తిరిగి రాకపోవడం, ఆచూకీ లభించకపోవడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఫొటో ఆధారంగా యువకుడి ఆచూకీ తెలిసిన వారు 87126-59839 లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

ఎడపల్లి, అక్టోబర్ 4: నిర్మల్ జిల్లా బాసర వెళ్లి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను జాన్కంపేట్‌లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ దండోరా సంఘం సభ్యులు కలిసి సన్మానించారు. జానకంపేట్ గ్రామంలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దల్ల సురేశ్, తాడెం సాయిలు, నగునూరి శేఖర్, శేఖర్,సాయి తదితరులు పాల్గొన్నారు.

వన్నెల్ (బీ)లో డీజే సీజ్

బాల్కొండ, అక్టోబర్ 4: డీజేలపై నిషేధం ఉన్నప్పటికీ మండలంలోని వన్నెల్(బి) గ్రామంలో ప్రబ్లిక్ స్థలంలో పరిమితికి మించి సౌండ్ పోల్యూషన్ చేసినందుకు డీజే నిర్వాహకుడిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. డీజేను సీజ్ చేశారు.

కాంగ్రెస్ నాయకుడిపై కేసు నమోదు

వినాయక్‌నగర్, అక్టోబర్ 4 : జిల్లాకేంద్రంలో డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ కాలర్ పట్టుకొని, విధులకు ఆటంకం కలిగించిన కాంగ్రెస్ నాయకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని పాత కలెక్టర్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన పీసీసీ విజయోత్సవ సభలో స్పెషన్ పార్టీ కానిస్టేబుల్ బొమ్మాళి అరవింద్ విధులు నిర్వర్తిస్తున్నాడు. పాస్ లేకుండా స్టేజ్‌పైకి వెళ్లేందుకు యత్నించిన కాంగ్రెస్ నాయకుడు ఎండీ హసన్‌ను కానిస్టేబుల్ బొమ్మాళి అరవింద్ అడ్డుకున్నాడు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన ఎండీ హసన్.. సదరు కానిస్టేబుల్ కాలర్ పట్టుకొని లాగి విధులకు ఆటంకం కలిగించాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఎండీ హసన్‌పై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో వెల్లడించారు.

వేల్పూర్ వీడీసీ అధ్యక్షుడిగా పురుషోత్తం

వేల్పూర్, అక్టోబర్ 4: వేల్పూర్ గ్రామాభివృద్ధి కమిటీ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పురుషోత్తం, ఉపాధ్యక్షుడిగా మహేశ్, ప్రధాన కార్యదర్శిగా పాండు, కోశాధికారిగా వడ్ల నరేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన గ్రామ కమిటీ కార్యవర్గాన్ని గ్రామస్తులు అభినందించారు.

మిషన్ భగీరథ నీటితో సంపూర్ణ ఆరోగ్యం

క్లోరినేషన్ విధానాన్ని పరిశీలిస్తున్న తాగునీటి సహాయకులు

నవీపేట, అక్టోబర్ 4: మిషన్ భగీరథ స్వచ్ఛమైన తాగునీటితో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఆర్ డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ మున్నీ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని యంచ డీ ఫ్లోరైడ్ పథకం ప్లాంటు వద్ద కొనసాగుతున్న తాగునీటి సహాయకుల రెండో రోజు శుక్రవారం శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. గోదావరి నీరు మిషన్ భగీరథ సంపులోకి సరఫరా చేసి అలంతో క్లోరినేషన్ చేసి మండలంలోని 56 గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. వాటర్ క్లోరినేషన్ విధానాన్ని శిక్షకుడు లక్ష్మీనారాయణ వివరించారు. కార్యక్రమంలో సంబంధిత స్కీం ఏఈలు రాము, చంద్రకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ఫ్రైడే డ్రైడే కొనసాగించాలి

నాగాపూర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మోర్తాడ్, అక్టోబర్ 4: ప్రతి గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని కొనసాగించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామంలో నిర్వహించిన ఫ్రైడేడ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, జీపీ సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

నీలా జీపీ ఎదుట ధర్నా చేపడుతున్న గ్రామస్తులు

రెంజల్, అక్టోబర్ 5: మండలంలోని నీలా గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన రాణిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామస్తులు జీపీ ఎదుట ధర్నాకు నిర్వహించారు. గ్రామంలోని ఇండ్ల క్రమబద్ధీకరణ, ఇంటి నంబర్ల కేటాయింపు, మ్యుటేషన్ విషయంలో కార్యదర్శి రాణి అక్రమాలకు పాల్పడినట్లు వారు ఆరోపించారు. విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు.

9న బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

బోధన్, అక్టోబర్ 4: బోధన్ పట్టణ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికను ఈనెల 9న నిర్వహించనున్నట్లు ఎన్నికల పర్యవేక్షకుడు ఎంబెల్లి శంకర్ తెలిపారు. శుక్రవారం ఎన్నికల నియమావళి, తదితర అంశాలపై మహాలక్ష్మి మందిరంలోని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో వివిధ కుల సంఘాలకు చెందిన 66 మంది ఓట్లు వేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల పర్యవేక్షకులుగా లోల శంకర్, ఎంబెల్లి శంకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోశెట్టి, బి.సాయిలు, అజయ్ వ్యవహరిస్తారని తెలిపారు. ఈనెల 5, 6 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 9వ తేదీన ఎన్నిక ఉంటుందని వెల్లడించారు. ఏకగ్రీవం వీలుకాని పక్షంలో ఓటింగ్ నిర్వహిస్తామని పర్యవేక్షకులు వెల్లడించారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

శ్రీరాంపూర్‌లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

బాల్కొండ, అక్టోబర్ 4: మండలంలోని శ్రీరాంపూర్‌లో అధికారులు డిజిటల్ ఫ్యామిలీ సర్వేను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఆర్.గంగామోహన్, ఎంపీవో రమణ, సూపరింటెండెంట్ భరత్, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆర్మూర్ ట్టణంలోని రెండో వార్డులో అధికారులు ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే నిర్వహించారు. ప్రజల వద్ద నుంచి కుటుంబ సభ్యుల వివరాలను అధికారులు సేకరించారు. స్థానిక కౌన్సిలర్ సంగీత సర్వేను పరిశీలించారు. అధికారులకు ప్రజలు సహకరించి పూర్తి వివరాలు ఇవ్వాలని సూచించారు.

బోధన్ దవాఖానలో మందుల కొరత

శక్కర్‌నగర్, అక్టోబర్ 4: బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో రోగులకు మందులు లభ్యం కావడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం షేక్ ఆదత్ తన మేనల్లుడు షేక్ ఆషిల్‌ను వైద్య చికిత్సల కోసం దవాఖానకు తీసుకెళ్లగా వైద్యుడు మందులు రాసి ఇచ్చాడు. అయితే ఈ మందులు ఫార్మసీలో లేవని సిబ్బంది తెలిపారు. వాటిని బయట కొనుక్కోవాలని సిబ్బంది సూచించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ దవాఖానలో మందుల కొరతపై ఆమ్‌ఆద్మీ పార్టీ బోధన్ కన్వీనర్ జునేద్ అహ్మద్ ఖలీల్ కలెక్టర్, వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు ఎక్స్ వేదికగా ఫిర్యాదు చేశాడు. దవాఖానలో సరైన వైద్యం అందడం లేదని, వసతులు సరిగా లేవని జునేద్ ఆరోపించారు. చిన్నారులకు విరేచనాలు తగ్గించే మందులు దవాఖానలో లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి రోగులకు న్యాయం చేయాలని కోరారు.

సంక్షిప్తంగా..

- **దరఖాస్తు చేసుకోవాలి-** మాక్లూర్, అక్టోబర్4: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాటనీ (వృక్షశాస్త్రం) సబ్జెక్ట్‌లో గెస్ట్ లెక్చరర్ పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గంగరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అభ్యర్థులు శనివారం సాయంత్రం 5.30 గంటలలోపు కళాశాలలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.
- **రైతులకు రుణమాఫీ చేయాలి -** మాక్లూర్, అక్టోబర్ 4: రైతులకు ఇచ్చిన హామీ మేరకు పూర్తి స్థాయిలో రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని, అన్ని పంటలకు రూ. 500 బోనస్ ఇవ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరి కోతలు ప్రారంభమవుతున్నాయని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.
- **రేపు ధ్యాన బతుకమ్మ సంబురాలు-** ఆర్మూర్‌టౌన్, అక్టోబర్4: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఆదివారం ధ్యాన బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తామని పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధ్యాన ఆత్మ జ్ఞాన కార్యక్రమం, అహింసాయుత మహాకరుణ, శాఖహార ర్యాలీని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.
- **ఘనంగా ఆలయ వార్షికోత్సవం-** వేల్పూర్, అక్టోబర్ 4: మండలంలోని లక్కోరా గ్రామంలోని 63వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ మహాలక్ష్మీ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం పూజలు నిర్వహించారు. గంగాజలంతో అభిషేకం చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.

NT-331783-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ క్లాసిఫైడ్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కొనసాగుతున్న బతుకమ్మ సంబురాలు

బోధన్/రెంజల్, అక్టోబర్ 4: బోధన్ పట్టణంలోని ఉషోదయ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. మహిళా అధ్యాపకులు విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడారు. సంబురాల్లో పాల్గొన్న విద్యార్థినులకు బోధన్ మున్సిపల్ వైర్‌పర్సన్ తూము పద్మావతి బహుమతులు అందజేశారు. కళాశాల డైరెక్టర్ సూర్యప్రకాశ్ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. గంగాధర్ పాల్గొన్నారు.

రెంజల్ మండలంలోని కందకుర్తి తదితర గ్రామాల్లో బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను చెరువులు, కుంటలు, గోదావరిలో నిమజ్జనం చేశారు.

కళాశాలలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు, ప్రజాప్రతినిధులు

నీరు విడుదల చేసేముందు సమాచారం ఇవ్వాలి

మాట్లాడుతున్న వన్నెల్(బి) గ్రామ మత్స్యకారులు

బాల్కొండ, అక్టోబర్ 4: ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసేముందు సమాచారం ఇవ్వాలని మత్స్యకారులు అధికారులను కోరారు. మండలంలోని వన్నెల్(బి)లో మత్స్యకారులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం వరదకాలువలో చేపలుపడుతుండగా ఒక్కసారిగా నీటి మట్టం పెరగడంతో ఆందోళనకు గురయ్యామని అన్నారు. సమావేశంలో మత్స్యకారులు ఊషన్న, శ్రీనివాస్, రాజశేఖర్, దేవిదాస్, నిరంజన్, కిశోర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

ఎడపల్లి, అక్టోబర్ 4: మండల కేంద్రంలోని పులిచెరువు కట్టపై గంగ పుత్రుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గంగమ్మ ఆలయానికి కందగట్ల రాంచందర్ రూ.20 వేల నగదును గంగపుత్రులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మల్లెపూల శ్రీనివాస్, సాయి సందీప్, లక్ష్మణ్, శ్రీనివాస్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.